## నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి


వరి పొలాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 9: నకిలీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని న్యూ బంజారాహిల్స్ తండాలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతుల వరి పొలాలను రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల్లో నకిలీ వరి విత్తనాలతో రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. తక్షణమే అధికారులు పొలాలను సందర్శించి నష్టాన్ని అంచనా వేసి రైతాంగానికి ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు మెదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

## 'లయన్స్‌క్లబ్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'


సమావేశంలో మాట్లాడుతున్న అమరేందర్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 9: సేవా కార్యక్రమాలను చేపట్టడంతో పాటు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో లయన్స్ క్లబ్‌లు ముందుండాలని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జీఎస్టీ కోఆర్డినేటర్ గోలి అమరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జీవీవీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ రీజియన్ మీట్ ఆఫ్ రీజియన్-4లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవ చేయడం మానవ ధర్మమని, మనవంతుగా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ప్రతి సభ్యుడు ముందు వరుసలో ఉండాలని కోరారు. క్లబ్‌ల ఆధ్వర్యంలో పేదల ఆకలి తీర్చడం, విద్యార్థుల చదువులకు చేయూత ఇవ్వడం, మహిళలకు ఉపాధి కల్పించేలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ గుడిపూరి వెంకటేశ్వర్‌రావు, క్లబ్ ప్రముఖులు తీగల మోహన్‌రావు, దోసపాటి గోపాల్, కోటేశ్వర్‌రావు, యానాల మోహన్‌రెడ్డి, నేతి రఘుపతి, కాపా మురళీకృష్ణ, మురళీధర్‌రావు, ఎన్.బాలయ్య, గండూరి కృపాకర్, రాచకొండ శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

- సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ భద్రయ్య


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న భద్రయ్య

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 9: ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో వడ్లకొండ కృష్ణ(బంటి)ని కుల దురహంకార హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య డిమాండ్ చేశారు. 'కుల, మతాంతర ప్రేమ వివాహాల్లో పరువు హత్యను నివారించడం ఎలా' అనే అంశంపై ఆదివారం జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కృష్ణ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందించాలని అన్నారు. కృష్ణ భార్య భార్గవికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బహుజన మహాసభ రాష్ట్ర నాయకుడు నారబోయిన వెంకట్, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు డేవిడ్‌కుమార్, మట్టిపల్లి సైదులు, దంతాల రాంబాబు, పేర్ల నాగయ్య, రేపాక లింగయ్య, షేక్ కరీం, ఎస్కే.ఉమర్, పి.వీరన్న, కునుకుంట్ల సైదులు, పోలెబోయిన కిరణ్, గుండు వెంకన్న, బుద్ధ సత్యనారాయణ, అనంత భాస్కర్, నామ నాగయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

## 'గీత కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

నూతనకల్, ఫిబ్రవరి 9: గీత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని గీత పనివారల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2.50 లక్షల మంది గీత కార్మికులు ఉండగా, కేవలం 10 వేల మందికి మాత్రమే కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారని విమర్శించారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే దహన సంస్కారాలకు తక్షణ సాయం కింద రూ.25 వేలు అందించాలని, మరణించిన వారి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మద్యం టెండర్లలో గీత కార్మికులకు 25 శాతం అవకాశం కల్పించాలని కోరారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సంఘం నాయకులు మద్దెల రామ్మూర్తి, బూడిద మల్లయ్య, బండపెల్లి సాగర్, మారగాని వెంకటాచలం, బీసు రామచంద్రు, యల్లయ్య, బిక్కి రవి పాల్గొన్నారు.

## 'భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి'


ఆందోళన చేస్తున్న రైతులు

చివ్వెంల, ఫిబ్రవరి 9: తమ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని ఉండ్రుగొండ గ్రామానికి చెందిన పలువురు దళితులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తుల్జారావుపేట రెవెన్యూ పరిధిలోని 54,55 సర్వే నంబర్లలో ఉండ్రుగొండ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తమ దగ్గర రెండెకరాల ఏడు గుంటల భూమిని గతంలో కొనుగోలు చేశాడని తెలిపారు. ఇప్పుడు అదనంగా 25 గుంటల భూమిని ఆక్రమించి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయారు. ఈ విషయమై ప్రశ్నిస్తే తమతో వాగ్వాదానికి దిగుతున్నట్లు చెప్పారు. గ్రామపెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిపితే వాయిదాలు వేస్తూ వచ్చారని తెలిపారు. వెంటనే జిల్లా అధికారులు తమ గ్రామాన్ని సందర్శించి న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో రైతులు పల్లేటి సైదులు, మామిడి ఎల్లయ్య, పల్లేటి లింగయ్య, పల్లేటి ప్రమీల, కాంపాటి వెంకన్న, చిలుముల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## 'ఆదివాసీల హత్యలను ఖండించాలి'

గరిడేపల్లి, ఫిబ్రవరి 9: నక్సల్స్ పేరుతో ఆదివాసీలను హతమారుస్తున్న కేంద్ర ప్రభుత్వ దమనకాండను ప్రజలంతా ఖండించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అటవీ సంపదను అంబానీ, అదానీ వంటి పెట్టుబడిదారులకు కట్టబెట్టాలనే దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఇలాంటి దారుణాలకు పాల్పడుతుందని ఆరోపించారు. వెంటనే నరమేధాన్ని ఆపి ఆదివాసీల జీవితాలకు భద్రత కల్పించాలన్నారు.

## బ్రహ్మోత్సవాలకు రూ.2 లక్షల విరాళం


ఉత్సవ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డికి విరాళం అందజేస్తున్న అభిషేక్‌రెడ్డి

అర్వపల్లి, ఫిబ్రవరి 9: అర్వపల్లి యోగానంద లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సామా అభిషేక్‌రెడ్డి ఆదివారం రూ.2 లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకటరెడ్డి, గుడిపెల్లి మధూకర్‌రెడ్డి, మహారాజు, సైదులు, సోమయ్య, వెంకన్న, అర్చకులు రాంబాబు, పవన్, ఆనంద్, వెంకటనాథచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్య తీరేది ఎప్పుడో..?

- తిరుమలగిరి మున్సిపాలిటీలో ఇండ్ల మధ్య నిలుస్తున్న మురుగు
- ఇక్కట్లు పడుతున్న ప్రజలు


తిరుమలగిరి 5వ వార్డులో ఇండ్ల మధ్య నిలిచిన మురుగు

తిరుమలగిరి, ఫిబ్రవరి 9: తిరుమలగిరి మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అనేక వార్డుల్లో డ్రైనేజీ కాల్వలు లేక ఇండ్ల మధ్యలో మురుగు నిలిచి ఈగలు, దోమలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. దుర్వాసన వెదజల్లడంతో పాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీలో ఇంటి బిల్లులు వసూలు చేస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

**శివారు ప్రాంతాల్లో సమస్యలు అధికం**

తిరుమలగిరి మున్సిపాలిటీలో మాలీపురం, నందాపురం, అనంతారం గ్రామాలను విలీనం చేశారు. ఈ శివారు ప్రాంతాల్లో డ్రైనేజీ కాల్వలు లేక ఖాళీ ప్రదేశాల్లో మురుగు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు విపరీతంగా ఉండడంతో జనావాసాల్లో విష పురుగులు సంచరిస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**కొన్ని ప్రాంతాల్లోనే చెత్త సేకరణ..**

మున్సిపాలిటీలో చెత్త సేకరణ వాహనాలు కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయి. అనే కాలనీల్లో, వార్డుల్లో ఈ వాహనాలు నెలలు గడిచినా వెళ్లడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు నిధుల కొరత కూడా ఉండడంతో స్థానిక తెలంగాణ చౌరస్తా పాత గ్రామంలోని బస్టాండ్‌తో పాటు కొన్ని వీధుల్లోనే చెత్త సేకరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### డ్రైనేజీ లేక ఇబ్బందులు..

మున్సిపాలిటీ పరిధిలో సూర్యాపేట జాతీయ రహదారి నుంచి పద్మశాలీ కాలనీకి వెళ్లే 30 ఫీట్ల దారిలో డ్రైనేజీ లేక ఇండ్ల మధ్యనే మురుగు నిలుస్తోంది. కంప చెట్లు పెరిగి దారి నడవడానికే ఇబ్బందిగా ఉంటుంది. చెత్త సేకరణ వాహనాలు పది రోజులకు ఒక్కసారి కూడా రావడం లేదు.

- వెంకటేశ్వర్లు, మాలీపురం

### శివారు ప్రాంతాలపై దృష్టి పెట్టాలి..

శివారు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్త సేకరణ వాహనాలు కూడా సక్రమంగా రావడం లేదు. సీసీ రోడ్లు కూడా సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

- నరేశ్, అనంతారం

## 'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం తప్ప ఏ ఒక్కటీ సరిగా అమలు కావడం లేదన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా హామీలను అమలు చేయలేదని, తక్షణమే అన్ని హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దేశోజు మధు, కొండేటి సంజీవరెడ్డి, దండి ప్రవీణ్, దామెర శ్రీను, ఉదయ్, వీరారెడ్డి, వెంకటరెడ్డి, భూపతిరెడ్డి, వెంకన్న, యాదగిరి పాల్గొన్నారు.

## 'హమాలీలకు కూలి పెంచాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 9: హమాలీల కూలి పెంచి వారిని ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ముత్తినేని కోటయ్య రైస్‌మిల్‌లో హమాలీ మేస్త్రీ యూనియన్ నాయకులతో కలిసి రైస్ మిల్లుల యాజమాన్యాలు, మర్చంట్స్ యూనియన్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలి పెంచాలని అన్నారు. సమావేశంలో ముత్తినేని వెంకటేశ్వరరావు, పునుగుపాటి వెంకటేశ్వరరావు, చిన్నం సురేశ్, బోగాల శ్రీనివాస్, సత్యనారాయణ, సీతారామయ్య, విశ్వనాథ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## చౌటపల్లిలో ఉచిత వైద్య శిబిరం


మఠంపల్లి: వైద్య శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

మఠంపల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని చౌటపల్లి గ్రామంలో మేళ్లచెర్వు మైహోం సిమెంట్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తున్నట్లు తెలిపారు. కాగా, వైద్య శిబిరంలో 850 మందికి పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ మైన్స్ ఏజీఎంలు నరేశ్, శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ శ్రీను, వైద్యులు చైతన్య, సీతారామ్, అనిల్‌రెడ్డి, రాకేశ్, భార్గవి, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**కుతుబ్‌షాపురంలో..**

గరిడేపల్లి: మండలంలోని కుతుబ్‌షాపురం గ్రామంలో నేరేడుచర్ల శ్రీగంగోత్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.మహేశ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

## యువత మత్తుకు దూరంగా ఉండాలి : ఎస్‌ఐ శ్రీనివాస్

మర్రిగూడ, ఫిబ్రవరి 9 : యువత్ డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలని ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ తుప్పరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వట్టిపల్లిలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగియగా.. విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి పొందిన యరగండ్లపల్లి జట్టుకు రూ.15,116, ద్వితీయ బహుమతి పొందిన వట్టిపల్లి జట్టుకు రూ.10,116ను ఎస్‌ఐ అందించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కొడాల అల్వాల్ రెడ్డి, సల్వోజు భిక్షమాచారి, మాజీ సర్పంచ్ మారగోని వెంకటయ్య, ఆర్గనైజర్లు కొన్‌రెడ్డి గిరి, కొంపెల్లి నాగరాజు గౌడ్, గాదగోని శ్రీకాంత్ పాల్గొన్నారు.

## 'బ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలి'


పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 9: బ్రాహ్మణులు ఐక్యంగా ఉంటూ సమాజ హితం కోసం పాటుపడాలని సూర్యాపేట బ్రాహ్మణ సేవా సమాజం అధ్యక్షుడు చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో పురోహిత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వావసు నామ తెలుగు సంవత్సర పంచాంగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణులు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించొచ్చని, చిన్న చిన్న భేదాభిప్రాయాలు ఉంటే మర్చిపోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు డాక్టర్ ఆదుర్తి రమేశ్‌చంద్ర, కట్టెకోల పూర్ణచందర్‌రావు, యల్లంభట్ల కృష్ణమూర్తి, టేకులపల్లి శ్రీనివాసరావు, మంత్రమూర్తి శంకరమూర్తి, శ్రీరామకవచం నాగయ్యశాస్త్రి, బందకవి కృష్ణమోహన్, పులి హరిప్రసాద్‌శర్మ, లక్ష్మణశర్మ, కిశోర్‌శర్మ, వెంకటాచార్యులు, రామచంద్రమూర్తి, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 9: ఆర్థిక ఇబ్బందులకు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన లింగం శ్రీను (48) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీను కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని నెమ్మికల్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని నెమ్మికల్, పాత సూర్యాపేట, ఏనుబాముల గ్రామాల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

## 15 నుంచి బండలాగుడు పోటీలు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని నల్లబండగూడెం గ్రామంలో ఈ నెల 15, 16 తేదీల్లో ఎద్దుల బండలాగుడు పోటీలు జరపనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ శివారులోని గట్టుపైన గల లింగమంతుల స్వామి వారి చిన్నగట్టు జాతర సందర్భంగా జాతీయస్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

## 'యాదవులు బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలి'

కోదాడ రూరల్, ఫిబ్రవరి 9: యాదవులు బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు మర్యాద సైదులు అన్నారు. ఆదివారం కోదాడలోని యాదవ సంఘం నాయకుడు ఈదుట కృష్ణయ్య నివాసంలో ఆ సంఘం నియోజకవర్గ, పట్టణ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాదవులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్, గుండెల సూర్యనారాయణ యాదవ్, పిన్నెబోయిన శ్రీనివాస్ యాదవ్, మాదాల ఉపేందర్ యాదవ్, రాముడు, గంధం ఉపేందర్ యాదవ్, ఎం.సైదుబాబు, జంగాల కృష్ణయ్య, లిక్కి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రికి కూతురి తలకొరివి

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 9: మండలంలోని చీదెళ్ల గ్రామానికి చెందిన కన్మంతరెడ్డి రఘోత్తంరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. ఆయనకు ఇద్దరూ కుమార్తెలే ఉండడంతో పెద్ద కుమార్తె శృతి ఆదివారం తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది. కొడుకులు లేకపోవడంతో అన్నీ తానై తలకొరివి పెట్టింది.

## 'రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం'

నూతనకల్, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి విమర్శించారు. ఆదివారం నూతనకల్‌లోని తొట్ల మల్సూరు స్మారక భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే ఎస్సారెస్పీ కాల్వలకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 9: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి కోరారు. ఆదివారం నేరేడుచర్లలోని పలు వీధుల్లో పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ, గృహాల ముందు చెత్త వేయరాదని ఆయన సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'టోల్‌గేట్ వద్ద ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి'


చిల్లేపల్లి టోల్‌గేట్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 9: మండలంలోని చిల్లేపల్లి టోల్‌గేట్ వద్ద 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల ప్రజలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాల ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక వాహనదారుల పట్ల టోల్‌గేట్ యాజమాన్య ధోరణిని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం చిల్లేపల్లి మూసీ వంతెనపైన నిర్వహించిన రాస్తారోకోను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితులంతా దాదాపు 21 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయుడు అమృతారెడ్డి, ఎంఈఓ చత్రునాయక్ పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం


హుజూర్‌నగర్: మదార్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న సంఘం నాయకులు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 9: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ షేక్ మదార్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో మదార్ కుటుంబానికి ఆదివారం రూ.1.60 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లాలు, నాయకులు చేపూరి లక్ష్మణ్, కృష్ణ, రవి, వెంకట్, శంకర్, శ్రీనివాస్, స్వామి, హరికృష్ణ పాల్గొన్నారు.

**మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..**


అర్వపల్లి: ఆర్థిక సాయం అందజేస్తున్న మున్నూరుకాపు స్ఫూర్తి సంఘం సభ్యులు

అర్వపల్లి: మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన కేసాని అనసూయ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, మున్నూరుకాపు స్ఫూర్తి సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆకుల సోమేశ్, తూడి మహేశ్, కోనేటి జానకిరామ్, కామిశెట్టి సుధాకర్, కడారి శ్రీను, పోలిశెట్టి రాఘయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం'


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 9: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. ఆదివారం కాపుగల్లు గ్రామంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు తన తల్లిదండ్రులు లక్ష్మమ్మ, సుభారావు జ్ఞాపకార్థం హైదరాబాద్ శ్యాం హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు గుండె, ఆర్థోపెడిక్, బీపీ, షుగర్ వంటి వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావేళ్ల సీతారామయ్య, ముత్తవరపు లక్ష్మి, ప్రజలు పాల్గొన్నారు.

## 'ప్రైవేట్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి'


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీయూఎస్ నాయకులు

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 9: ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు బస్కూరి కేపీ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన 2025 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిల్లలమర్రి కళింగం, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, బచ్చలకూరి జానయ్య, మహేశ్, రాజశేఖర్, రమేశ్, సోమరాజు, వెంకన్న, లక్ష్మణ్, బాలకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం


స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, గ్రామ ప్రజలు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 9 : చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గ్రామోత్సవంతో ఆదివారం ప్రశాంతంగా పరిపూర్ణమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగిన జాతర గజవాహన సేవతో ముగిసింది. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై చెర్వుగట్టు, ఎల్లారెడ్డి గూడెం గ్రామాల్లో ఊరేగించారు. ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ కార్యక్రమంలో ఈఓ నవీన్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.